జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజలకోసం
## కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
గురువారం । 19 । ఫిబ్రవరి । 2026 । పేజీలు: 8


2

మాసుల ప్రవీణ్‌కు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం



# వైద్యం డాక్టర్లది...
# వ్యాపారం ఆర్ఎంపీలది




6

వైద్యుల కంటే... ఆర్ఎంపీలదే హవా

ఆర్ఎంపీల రిఫరెన్స్ తోనే ప్రైవేట్ దవాఖాన మనుగడ

మెడికల్ మాఫియాను శాసిస్తున్న గ్రామీణ వైద్యులు

కమిషన్ ఇస్తేనే రోగులను పంపిస్తా ...




3

## కరీంనగర్ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయం..!

కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం...
మేయర్ కొలగాని శ్రీనివాస్

## పార్టీలకు అతీతంగా అభివృద్ధి యే లక్ష్యం

మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్...

8


# రిపోర్టర్ టు మున్సిపల్ కౌన్సిలర్

### మాసుల ప్రవీణ్‌కు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం



**మెట్‌పల్లి, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**

మున్సిపల్ ఎన్నికల్లో 20వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా విజయం సాధించిన టీయూడబ్ల్యూజే ఐజేయు మెట్‌పల్లి గౌరవాధ్యక్షుడు మాసుల ప్రవీణ్‌కు ప్రెస్ క్లబ్ సభ్యులు బుధవారం ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. పూలమాలలతో, శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. జర్నలిస్టుల వర్గానికి చెందిన వ్యక్తి ప్రజాప్రతినిధిగా ఎన్నిక కావడం గర్వకారణమని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శక పాలన అందించాలని సూచించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయు మెట్‌పల్లి అధ్యక్షుడు డా. బూరం సంజీవ్, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్, ఉపాధ్యక్షులు జంగం విజయ్, అఫ్రోజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా, బాసెట్టి హరీష్, గౌరవ సలహాదారులు దాసం కిషన్, క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ పుంద్ర శశికాంత్ రెడ్డి, పింజర్ శివ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, కుర్ర రాజేందర్, యానం రాకేష్, రఫీ ఉల్లా, సోహెల్, హైమద్, ముత్యాల రమేష్, ఓంకారి శ్రీనివాస్, బొల్లం రాజు, మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్, సభ్యులు ఆదిల్ పాషా, రమణ, ఏసమేని గణేష్, ఎండి అభిద్, శశి కుమారు, అమ్ముల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

**రాయికల్, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**



ఈనెల 20వ తేదీ నుండి హైదరాబాద్ నగరంలో నిర్వహించ నున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు రాయికల్ మండలంలోని రామాజీపేట్ గ్రామానికి చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎనుగంటి సాహిత్య ఎంపికైనట్లు ప్రధానోపాధ్యా యులు గజ్జేల నరేందర్ తెలిపారు. జగిత్యాల జిల్లా తరఫున సాహిత్య ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననుండటం పాఠశాలకు గర్వకారణమని పేర్కొ న్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థిని కబడ్డీ క్రీడలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీల్లో రాణించడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఆమె కృషి, పట్టుదలతో రాష్ట్ర స్థాయిలోనూ మంచి ప్రతిభ చూపి పాఠశాలకు, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థిని ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## నాచుపల్లిలో పూడికతీత పనులు

**కొడిమ్యాల, ఫిబ్రవరి 18,(ప్రజాజ్యోతి):**

మండలంలోని నాచుపల్లి గ్రామంలో మాసముద్రం నుండి గ్రామంలోని బీరప్ప వాడ,ఎస్సి కాలనీ(దొంగలమర్రి రోడ్) బోరింగ్ వరకు పూడికతీత మరియు కాలనీలో డ్రైనేజి పారిశుద్ధ్య పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ బొడ్డెల్లి నాగమణి తెలిపారు.కాలువలో పూడిక పెరగడంతో నీటి పారుదల మందగించిన నేపథ్యంలో యంత్రాల సహాయంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. బొడ్డెల్లి భరత్,ఇరికి మహేష్,వార్డ్ మెంబర్ గాజుల లక్ష్మణ్ పాల్గొన్నారు.



# ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోరా..?

**కొడిమ్యాల, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**



మండలంలోని డబ్బు తిమ్మయపల్లి గ్రామంలో ప్రధాన రహదారిపై గ్రామ ప్రవేశం వద్ద రోడ్డు పక్కనే ఉన్న బావి రక్షణ గోడ లేకుండా ప్రమాదకరంగా మారింది. రహదారికి అతి సమీపంలో ఉన్న ఈ బావి ప్రయాణికులు, వాహనదారులకు ముప్పుగా ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో బావిని గమనించలేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు. ఈ మార్గం గుండా విద్యార్థులు, వృద్ధులు, రైతులు నిత్యం సంచరిస్తుండటంతో ప్రమాద భయం నెలకొంది. గ్రామ ప్రవేశం వద్దే ఇలాంటి ప్రమాదకర పరిస్థితి ఉండటం బాధాకరమని వారు తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లభించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు కూడా ఈ అంశాన్ని పట్టించుకోలేదని, కనీస భద్రతా చర్యలు తీసుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రస్తుతం కూడా పరిస్థితిలో మార్పు లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.ఇకనైనా అధికారులు స్పందించి బావి చుట్టూ రక్షణ గోడ నిర్మాణం చేపట్టి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అత్తింటి వేధింపులు తట్టుకోలేక వివాహిత ఆత్మహత్య

**కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**



కట్నం కోసం అత్తింటి వారి వేధింపులు తట్టుకోలేక ఓ వివాహిత పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కరీంనగర్ జిల్లాలో చోటుచేసుకుంది. కరీంనగర్ రూరల్ సీఐ తెలిపిన వివరాలు ప్రకారం మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం గొల్లపల్లికి చెందిన మమత (29)ను ఆమె భర్త కంబాల నరేష్‌తో పాటు అత్తామామలు కట్నం కోసం శారీరకంగా,మానసికంగా వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పెళ్లయిన నెల రోజుల నుంచే వేధింపులు ప్రారంభమయ్యాయని,ఈ క్రమంలో రెండు నెలల క్రితం రూ. లక్ష నగదు ఇచ్చినప్పటికీ వేధింపులు ఆగలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.ఇటీవల భర్త అనారోగ్యం పాలవడంతో అతడిని కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించగా,అక్కడ కూడా అత్తింటి వారు మమతను మానసికంగా వేధించినట్లు సమాచారం.ఈ వేధింపులు తట్టుకోలేక మమత తీగలగుట్టపల్లిలోని హనుమాన్ నగర్ రైల్వే ట్రాక్ సమీపంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది.మృతదేహాన్ని కరీంనగర్ సివిల్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.మమత తండ్రి ఫిర్యాదు మేరకు భర్తతో పాటు అత్తింటి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి తెలిపారు.

## విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటర్మీడియట్ దశ విద్యార్థుల భవిష్యత్తును నిర్ధేశించే కీలక సమయమని, సరైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని ముందుకు సాగాలని సూచించారు. యువత దురలవాట్లకు లోనుకాకుండా క్రమశిక్షణతో మెలిగి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. తాను ఈ కళాశాల పూర్వ విద్యార్థినేనని, రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. హైస్కూల్‌కు పక్కా భవనం నిర్మాణ పనులు త్వరలో పూర్తవుతాయని చెప్పారు. సుల్తానాబాద్‌లోని మహాత్మ జ్యోతిబా పూలే మహిళా డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మాణం కోసం నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు రూ.15 కోట్ల నిధులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన ఫ్యాకల్టీ అందుబాటులో ఉందని, విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను కలిసి కోరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ చైర్మన్ ప్రకాష్‌రావు, ప్రిన్సిపాల్, డీఐఈఓ, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నిందితుడికి 5 ఏళ్ల జైలు శిక్ష ...రూ.4 వేల జరిమానా

## బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశం

**ఎన్టీపీసీ, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**

గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2015లో నమోదైన మోసం, దళితులపై దౌర్జన్యానికి సంబంధించిన కేసులో నిందితుడికి కోర్టు ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధించింది. అదనంగా బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. గోదావరిఖని నివాసి ముత్యాల సుదర్శన్ (తండ్రి లింగయ్య)పై భారతీయ శిక్షాస్మృతి సెక్షన్లు 493, 496తో పాటు ఎస్సీ/ఎస్టీ (అత్యాచారాల నివారణ) చట్టంలోని సెక్షన్లు 3(1)(), 3(2)() కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు క్రైం నంబర్ 285/ 2015గా నమోదు కాగా, అనంతరం సెషన్స్ కేసు నంబర్ 74/2017గా కరీంనగర్ జిల్లా 3వ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయస్థానం, ప్రత్యేక ఎస్సీ/ఎస్టీ కేసుల విచారణ కోర్టులో విచారణకు వచ్చింది. విచారణ అనంతరం న్యాయమూర్తి ఏ.నీరజ నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధించారు. బాధితురాలి కి రూ.3 లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

### ఘటన వివరాలు ఇలా

ఎఫ్‌సీఐ రామగుండం ప్రాంతానికి చెందిన గంగారపు శారదాదేవి (తండ్రి నరసయ్య, కులం మాదిగ)కు 2008లో అడ్డగుంటపల్లి, గోదావరిఖనికి చెందిన ముత్యాల సుదర్శన్‌తో పరిచయం ఏర్పడింది. 2010లో ఆమెను పెళ్లి చేసుకుంటానని, ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి డబ్బులు తీసుకున్నాడు. అనంతరం కొన్నేళ్లకు ఆమెను గర్భవతిని చేసి, “నీకు నాకు సంబంధం లేదు. నువ్వు మాదిగ కులస్తురాలివి” అంటూ ఆమెను, ఆమె కుటుంబ సభ్యులను దూషించి మోసం చేశాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి దర్యాప్తు అధికారి ఎస్. మల్లారెడ్డి (ప్రస్తుతం అదనపు ఉప పోలీస్ కమిషనర్, సైబర్ క్రైమ్, హైదరాబాద్)గా వ్యవహరించారు. కోర్టులో ప్రభుత్వ తరఫున అదనపు ప్రజాప్రతినిధి న్యాయవాది కోలా ఝాన్సీ వాదనలు వినిపించారు. సమన్వయ అధికారిగా ఇంద్రసేనారెడ్డి (ఇన్‌స్పెక్టర్), సంబంధాధికారిగా తిరుపతి రావు (సహాయ ఉప ఇన్‌స్పెక్టర్), కేసు నిర్వహణ అధికారిగా మహేందర్ (పోలీస్ కానిస్టే బుల్) విధులు నిర్వర్తించారు. పోలీసులు సమగ్ర దర్యా ప్తు నిర్వహించి పక్కా సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించడంతో నిందితుడికి శిక్ష ఖరారు కావడంలో అభియోగ వాదన బృందం కీలక పాత్ర పోషించింది. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సంబంధిత అధికారులను అభినందించారు.

# కరీంనగర్ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయం..!

### కార్పొరేషన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం... వారంలో ఒక రోజు డివిజన్ లో పర్యటిస్తా.. మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**

బిజెపి పై నమ్మకంతో కరీంనగర్ నగరపాలక సంస్థ బాధ్యతలను అప్పజెప్పిన పట్టణ ప్రజలందరికీ శిరస్సు వంచి నమస్కారాలు తెలియజేస్తున్నామని, ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతతో పనిచేస్తామని, డివిజన్ సమస్యల పరిష్కారం కోసం వారంలో ఒక రోజు డివిజన్ లో పర్యటిస్తనని, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని మేయర్ కోలగని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ పట్టణం 66 డివిజన్లో 13.5 లక్షల నిధులతో చేపట్టిన రోడ్డు, డ్రైనేజీ పనులను డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్ వంగల పవన్ లతో కలిసి మేయర్ కోలగని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కోలగని శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ ప్రజలు తమ మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. నగర అభివృద్ధి కోసంకరీంనగర్ పట్టణ ప్రముఖులు, ప్రజల సూచనలు, అభిప్రాయాలను , సలహాలను పరిగణలోకి తీసుకొని ముందుకు కొనసాగుతామని తెలిపారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో నగరాన్ని మరింత అభివృద్ధి చేసే ఆలోచనతో ఉన్నామని , గతం కంటే మెరుగైన స్థితిలో కరీంనగర్ పట్టణాన్ని అభివృద్ధి దిశలోకి తీసుకు వెళ్లడానికి శాయశక్తుల కృషి చేస్తామన్నారు. ప్రధానంగా నగరపాలక సంస్థలోని 66 డివిజన్లో మౌలిక వసతులకు పెద్దపీట వేస్తామని,ప్రజలకు రోడ్లు, డ్రైనేజీల సమస్య ల కు విముక్తి కల్పించే లక్ష్యంతో సంకల్పంతో ఉన్నామన్నారు.కార్పొరేషన్ లో విలీనమైన గ్రామాలో నెలకొన్న సమస్యలపై ప్రధాన దృష్టి సారించి, సాధ్యమైనంతవరకు సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించేలా , రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని ఏ డివిజన్ కు తాగునీటి కొరత రాకుండా చూస్తామన్నారు.నగరపాలక సంస్థలో ప్రజలకు అవసరమయ్యే పనులు త్వరితగతిన వేగంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు . ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సునీల్ రావు , కార్పొరేటర్లు వంగల పవన్ , గుగ్గిలపు రమేష్, సోమిడి వేణు ప్రసాద్, బండ రమణారెడ్డి, కె పీ చంద్ర, శ్రీనివాస్, తాటి ప్రభావతి, కన్న కృష్ణ, బిజెపి మీడియా కన్వీనర్ కటకంలోకేష్, నాయకులు వరాల జ్యోతి,సురేష్, కొంపల్లి రామన్,శ్రీనివాస్,లడ్డు ముందడ, తనకు సాయి కృష్ణ , కైలాస నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కోతుల బెడద నివారణకు ...

# ఎలుగుబంటి వేషంతో వినూత్న ప్రయత్నం

**ముస్తాబాద్, ఫిబ్రవరి 18 ( ప్రజా జ్యోతి ):**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో కోతుల బెడదను తగ్గించేందుకు గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినూత్న ప్రయత్నం చేపట్టారు. కోతులను గ్రామం నుండి దూరం చేయడానికి ఎలుగుబంటి వేషధారణతో ఒక వ్యక్తిని గ్రామంలో తిరిగేలా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, వార్డు సభ్యులు శేఖర్, వెంకట్రావ్, శ్రీనివాస్, ఎన్ఆర్ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్, శంకర్, బాల్ నర్సయ్య, బాలయ్య, అశోక్, భాస్కర్, బాబు, శ్రీనివాస్, పర్శరాములు తదితరులు పాల్గొని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోందని తెలిపారు. పెంకుటిల్లు, రేకుల ఇళ్లు, డాబా ఇళ్లు అనే తేడా




లేకుండా కోతులు చిందరవందర చేస్తున్నాయని అన్నారు. ఇంట్లో మనుషులు ఉన్నప్పటికీ నేరుగా వంటగదిలోకి ప్రవేశించి కూరగాయలు, పప్పులు వంటి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడంతో గ్రామ-స్తులు భయభ్రాంతులకు గురవుతున్నారని వివరించారు. కోతుల సమస్యను అరికట్టేందుకు ఎలుగుబంటి వేషధారణతో చేపట్టిన ఈ చర్య ఒక చిన్న ప్రయత్నమేనని, దీని ఫలితాలను పరిశీలించి అవసరమైతే మరిన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా ప్రయత్నాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంఈఓ ప్రభాకర్

### ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్యాలెండర్లు బహుకరణ

**ధర్మారం, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**

:పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో స్థానిక సర్పంచ్ మందాల శ్రావణి హరీష్ సహకారంతో విద్యార్థుల ఫొటోలతో రూపొందించిన క్యాలెండర్ ను బుధవారం రోజు ఉదయం మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ విడుదల చేశారు.ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ పత్తిపాక గ్రామంలో విద్యాభివృద్ధి కోరి ప్రజాప్రతినిధులు,దాతలు ముందుకు వచ్చి అనేక కార్యక్రమాల్లో పాఠశాల అభివృద్ధికి సహకరించటం అభినందనీయమన్నారు.ఈ విద్యాసంవత్సరంలో ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులందరికి టై,బెల్ట్స్, ఐడెంటిటీ కార్డులు,కొత్తగా చేరిన యాభై మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, డైరీలు,ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూ కొరకు పదివేల రూపాయలు,రిపబ్లిక్ డే వేడుకలకు ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులందరికి సుమారు ఇరవై వేల రూపాయలతో బహుమతులు,స్వీట్లు అందించడమే కాకుండా ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదివే విద్యార్థులకు స్పెషల్ క్లాసుల సందర్భంగా అల్పాహారం కొరకు ఆర్థిక సహకారం అందించటం వంటి కార్యక్రమాల పట్ల సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా క్యాలెండర్ తయారీ కొరకు ఐదు వేల




రూపాయలు విరాళంగా అందించిన సర్పంచ్ దంపతులను మండల విద్యాధికారి ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూతి మల్లన్న,గ్రామ సర్పంచ్ మందాల శ్రావణి హరీష్,ఉపాధ్యాయులు గంద్రాతి శ్రీలత,అనుమల్ల శారద,సిరిపురం సునిల్, చెక్కపల్లి అరుణశ్రీ,ఉప సర్పంచ్ పూసాల మల్లేశం,కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ ఎదుల్ల ప్రేమ్ సాగర్, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్ పర్సన్ ఏలేటి పద్మ, గ్రామ పంచాయితీ సెక్రెటరీ అంజలీధర్,వార్డు సభ్యులు ఎదుల్ల అంజయ్య, జిల్లాల కాంతారాజు, అంగన్వాడీ టీచర్ వినోద, కారోబార్ ఎదుల్ల రవికుమార్,ఎదుల్ల ప్రభాకర్,విజయగిరి బ్రహ్మచార్యులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు



**కాల్వ శ్రీరాంపూర్, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ టీచర్ అసోసియేషన్ మండల శాఖఆధ్వర్యంలో టాలెంట్ .టెస్ట్. నిర్వహించడం జరిగింది. మొట్లపల్లి గ్రామానికి చెందిన చొప్పరి విష్ణు తేజ. కూనారం గ్రామానికి చెందిన. హర్షిత. అనే విద్యార్థులు. ప్రతిభ కనబరిచి. అత్యధిక మార్కులు. పొం ది. మండల టాపర్గా నిలిచారు. వీరిని బుధవారం రోజున ఏర్పాటు చేసిన సమావేశంలో. మండల విద్యాధికారి సిరిమల మహేష్. తో పాటు ప్రధానోపాధ్యాయులు. కె శ్రీధర్ గౌడ్. వి రవీందర్. మండల అధ్యక్ష కార్యదర్శులు. బి .జయప్రకాష్ బి మహేందర్. లు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఈనెల 21న జిల్లా స్థాయిలో జరిగే టెస్ట్ లో పాల్గొని మండలానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం .విద్యార్థిని విద్యార్థులు .పాల్గొన్నారు.

## జేఈఈ ఫలితాల్లో సైనిక్ విద్యార్థుల ప్రతిభ

**చొప్పదండి, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**




జె ఈ ఈ మెయిన్స్ 2026 ఫలితాల్లో చెప్పాలని మండలం రుక్మాపూర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కళాశాలలో మొత్తం 48 మంది విద్యార్థులు మె-యిన్స్ ఎంట్రన్స్ పరీక్ష వ్రాయగా 7 మంది విద్యార్థులు జె ఈ ఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. వీరికి నెట్ ఐఐటి జిఎఫ్టిఐ లలో సీట్లు లభిస్తాయి.ఉత్తమ ఫలితాలు సాధించి నందుకు విద్యార్థులు రాఘవ, వెంకటేష్, భాను కుమార్, మహి వర్షిత్, వినయ్ ,యశ్వంత్, సాయిచరణ్ లను కళాశాల డైరెక్టర్ రాజదత్త, ప్రిన్సిపాల్ లింగయ్య అభినందించారు.

## ఆర్నకొండ జెడ్పిహెచ్ఎస్ లో విద్యార్థులకు హెల్త్ చెకప్



**చొప్పదండి, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**

చొప్పదండి మండలం అర్నకొండ జడ్పీహెచ్ఎస్ లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ వైద్యులు సురేష్, ప్రతిభ ఆధ్వర్యంలో పాఠశాలలోని 130 మంది విద్యార్థులకు టోటల్ హెల్త్ చెకప్ నిర్వహించారు. విద్యార్థుల హిమోగ్లోబిన్ పర్సంటేజ్, బి.పి, షుగర్, తదితర పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు తగిన సూచనలు చేశారు. గతంలో డెంటల్ చెక్అప్ చేసి అవసరమైన విద్యార్థులను కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రీట్మెంట్ చేయించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ దీక్షిత్ మాట్లాడుతూ ప్రభుత్వము పాఠశాల విద్యార్థుల చదువు, మధ్యాహ్నం భోజనం మాత్రమే కాకుండా వారి ఆరోగ్యము పట్ల చేపడుతున్నటువంటి చర్యలు పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ రాజశేఖర్, ఏఎన్ఎం త్రివేణి, ఆశా వర్కర్లు వనిత ,స్వప్న ఉపాధ్యాయులు లక్ష్మణ్ కుమార్, రాజమౌళి, గంగాధర్ వెంకటేశ్వరరావు,ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఐపీఎస్ విద్యార్థులు ఎంపిక



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలకు స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లోకల్ టు గ్లోబల్ అనే నినాదంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలకు సుల్తానాబాద్ స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. టేబుల్ టెన్నిస్ బాలికల విభాగంలో ఈ వర్షిత, సిహెచ్ ఖుషి,కే మనస్విని, ఎస్ సాత్విక, బాలుర విభాగంలో బి మణికంఠ, ఎండి అష్రఫ్, ఎస్ సృజన్, ఏం సహర్ష్ ఎంపిక కాగా వాలీబాల్ బాలుర విభాగంలో ఎం అక్షిత్ కుమార్, బాలికల విభాగంలో డి ప్రియదర్శిని, కే లాస్య, ఫుట్బాల్ బాలుర విభాగంలో హార్దిక్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ అభినందించారు. వారు మాట్లాడుతూ "క్రీడలతో శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని,విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో నూ రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ శివ సతీష్ మమత పాల్గొన్నారు.

# కాన్వాయ్‌పై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

**సుల్తానాబాద్, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**



మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లి చైర్‌పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నికల సందర్భంగా పర్యటి స్తున్న రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ కాన్వాయ్ పై మాజీ ప్రజాప్రతినిధి బాల్క సుమన్ అనుచరులు దాడి చేయడం తీవ్రంగా ఖండనీయమని దళిత సామాజిక హక్కుల పరిరక్షణ సమితి పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం సతీష్ కుమార్ పేర్కొన్నారు. పదేళ్లపాటు టీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించిన బాల్క సుమన్ ప్రతిపక్ష నాయకుడిగా హుందాగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిమగ్నమై నిస్వార్థంగా సేవలందిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ కాన్వాయ్‌పై దాడి జరగడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులు తక్షణమే కఠిన చర్యలు తీసుకుని దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# దేవస్థానంలో పూర్తయిన టెండర్ వేలం

**జమ్మికుంట, ఫిబ్రవరి18 ( ప్రజాజ్యోతి ):**

ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో కొబ్బరికాయలు, పూజా సామాగ్రి అమ్మకపు హక్కు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునే హక్కుల కోసం వార్షిక టెండర్ వేలం నిర్వహించామని ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు తెలిపారు. కొబ్బరికాయలు, పూజా సామాగ్రి అమ్మకపు హక్కును గోరంటల వరలక్ష్మి రూ.9,70,116కు దక్కించుకోగా, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునే హక్కును బోయిని సంపత్ రూ.4,56,500కు పొందారు. ఈ హక్కులు ఒక సంవత్సర కాలం వర్తిస్తాయని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలకులు-2 సత్యనారాయణ, ఈఓ కె.సుధాకర్ పాల్గొన్నారు.



# యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ క్యాంపెయిన్ తెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

## సమాచార హక్కు చట్టం అమలులో లోపాలు సరిదిద్దాలని వినతి



**పెద్దపల్లి, ప్రతినిధి ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**

యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ క్యాంపెయిన్ తెలంగాణ ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, దేశాల భూపాల్, మోహసిన్ ఫర్వీన్, బైరెడ్డి అయోధ్యరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. బుధవారం గోదావరిఖనిలోని సింగరేణి ఇల్లందు అతిథి గృహంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర సహ-కన్వీనర్ సోమ వెంకటేశ్వర్లు, మహిళా రాష్ట్ర సహ-కన్వీనర్ ఎస్.లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లా, కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో సమాచార హక్కు చట్టం2005 అమలులో ఎదు-రవుతున్న సమస్యలను వివరించారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు సమయానికి సమాచారం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సంబంధిత అధికారుల వివరాలు ప్రదర్శించే బోర్డులు లేకపోవడం, 30 రోజుల గడువులో సమాచారం ఇవ్వకపోవడం, అప్పీలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటం వంటి అంశాలను రాష్ట్ర సమాచార కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణ ప్రజలకు సమాచార హక్కుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రభుత్వ రికార్డులను డిజిటలైజేషన్ చేయాలని, చట్టంలోని సెక్షన్4 కింద స్వచ్ఛంద ప్రకటనలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార కమిషనర్లకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ జంగ చక్రధర్ రెడ్డి, సహ-కన్వీనర్ ఆరెల్లి మల్లేష్, ఎం.రాజేశం, ఎస్.నాగేశ్వర్, జి.సురేష్, ఎండి.తాజుద్దీన్ బాబా, జి.చిరంజీవి, జి.చంద్రమౌళి, పి.రాజ్‌కుమార్, ఓల్లే తిరుపతి, కె.గుణకరం తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు సన్‌రైజ్ స్కూల్ విద్యార్థినులు

**మేడిపల్లి, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**

జిల్లా స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ వాలీబాల్ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి, పోరుమల్లలోని సన్‌రైజ్ హైస్కూల్ జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టులోని ముగ్గురు క్రీడాకారిణులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారిణులు తాటి నయనిక, కుంటి సహస్ర,పొన్నం అమూల్య, రాష్ట్రస్థాయికి ఎంపికై పాఠశాలకు, గ్రామానికి పేరు తెచ్చిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ ఎడ్వర్డ్ జోయెల్, పాఠశాల డైరెక్టర్లు తాటి తిరుపతి రెడ్డి, పెద్దిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పి ఈ టీ దాసరి దిలీప్ అధ్యాపక బృందం రాష్ట్రస్థాయిలో కూడా వీరు రాణించి విజయం సాధించాలని కోరారు.



# అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం



**ఎన్టీపీసీ, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**

రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ పీకే రామయ్య కాలనీలోని అంగన్వాడి కేంద్రంలో బుధవారం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాశనం కార్యక్రమాలతో పాటు గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం నిర్వహించారు. అంగన్వాడి టీచర్ సరిత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నూతనంగా ఎన్నికైన 1వ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, అన్నప్రాశనం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజల ఆశీర్వాదంతో తాను ఏకగ్రీవంగా కార్పొరేటర్‌గా ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించడం వల్ల పేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. కేంద్రాలను నిర్వహిస్తున్న టీచర్లు, సిబ్బంది నిబద్ధతతో సేవలందిస్తూ ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి చేరవేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సోషల్ మీడియా ఇన్‌చార్జి గుర్రాల మల్లేష్ యాదవ్, పీకే రామయ్య కాలనీ ఆర్పీ గీద రాణి తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ సుమలత గంగారెడ్డిని సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు



**చొప్పదండి, ఫిబ్రవరి 18 ( ప్రజా జ్యోతి):**

చొప్పదండి పట్టణంలో బుధవారం బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సంపత్ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్ గా భారీ మెజార్టీతో గెలుపొందిన సుమలత గంగారెడ్డిని బిఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి,మాచర్ల సౌజన్యవినయ్ కుమార్, నలుమాచు రామక్రిష్ణ, కొత్తూరి మహేష్, మంద నర్సయ్య, లోక రాజేశ్వర్ రెడ్డి, వెల్మ నాగిరెడ్డి, సీపెల్లి గంగయ్య, కొక్కుల రామ్మోహన్, గుండేటి రాజారమేష్, బీసవేని రాజశేఖర్ గౌడ్, ముద్దం కుమార్, చొక్కల్ల తిరుపతి, భైర కన్నా, సత్తు నర్సయ్య, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ముచ్చర్ల గ్రామపంచాయతీలో పారిశుద్ధ కార్మికులకు శానిటైజర్ పంపిణీ

**గంభీరావుపేట, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**

గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామంలోని గ్రామపంచాయతీలో పని చేస్తున్న పారిశుద్ధ కార్మికులకు బుధవారం రోజున గ్రామ పచాయతీ ఆవరణలో సర్పంచ్ నక్క ప్రశాంత్ మరియు పలకవర్గ సభ్యులతో కలిసి. సబ్బులు, సరుపులు కొబ్బరి నూనె, షాంపులు డెటాల్ మొదలగు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ కొల రాజు వార్డ్ సభ్యులు గొండ్లే తిరుపతి, గాడిచర్ల రాకేష్, అవునూరి కృష్ణ, గాధం శ్రీ విద్యతో పాల్గొన్నారు.



# మానస ఫ్రెండ్స్ షూ మార్ట్' పేరుతో ఘరానా మోసం

### ఎమ్మార్పీ రేట్ల కంటే అధిక ధరలకు విక్రయం
### దళిత బంధు పథకంకు తప్పుడు కొటేషన్లు



**జమ్మికుంట, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**

జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా సమీపంలో 'మానస ఫ్రెండ్స్ షూ మార్ట్' పేరుతో విక్రయాలు చేస్తూ వినియోగదారులు ఘరానా మోసం చేస్తున్నారని వినియోగదారులు ఆరోపణలు చేస్తున్నారు. చెప్పులు కొనుగోలు చేయడానికి వెళ్లిన వినియోగదారులకు బాక్స్‌పై ఉన్న అసలు ప్రింట్ రేట్ తొలగించి , షాప్ యాజమాన్యం తమ సొంత రేట్లు అతికించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని బాధితులు ఆరోపించారు. ఈ విషయంపై ప్రశ్నించిన కస్టమర్లతో యాజమాన్యం వాగ్వాదానికి దిగుతూ "మేము చెప్పులు అమ్మును మీకు నచ్చిన షాప్ లో కొనుకోండి అంటూ తిరస్కార ధోరణి ప్రదర్శిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. పేద ప్రజలను లక్ష్యంగా చేసుకుని అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**దళిత బంధు పథకం కు తప్పుడు కొటేషన్లు**

దళిత బంధు పథకం పొందిన లబ్ధిదారులకు తప్పుడు కొటేషన్లు, జీఎస్టీ వివరాలు ఇస్తూ షాపులు నెలకొల్పి ప్రభుత్వాన్ని, ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ షాపు ద్వారా ఎన్ని దళిత బంధు కొటేషన్లు జారీ అయ్యాయి? ప్రభుత్వానికి ఎంత పన్ను చెల్లించారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నారు. ఎమ్మార్పీ లేకుండా అధిక ధరలకు విక్రయాలు చేస్తున్న విషయం లో విచారణ జరిపి సంబంధిత షాపు యజమానింపై చట్టపరమైన చర్యలు తీసుకుని, ప్రజలను నిలువునా దోచుకుంటున్న దోపిడిని అరికట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కరీంనగర్ జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు



**కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**

కరీంనగర్ జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు మె-యిల్ రావడంతో బుధవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కోర్టు ప్రాంగణంలో 12 ఆర్టీఎక్స్ బాంబులు అమర్చామని, మధ్యాహ్నం 12.05 గంటలకు అవి పేలుతాయని పేర్కొంటూ జిల్లా పరిపాలన అధికారి మాధవికి ఓ అగంతకుడు ఈ-మెయిల్ పంపినట్లు అధికారులు తెలిపారు. మెయిల్ అందుకున్న వెంటనే కోర్టు అధికారులు అప్రమత్తమై స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం మేరకు కరీంనగర్ టూటౌన్ సీఐ సృజన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీగా పోలీసు బలగాలు,బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దించారు.భద్రతా చర్యలలో భాగంగా కోర్టు భవనాల్లో ఉన్న న్యాయమూర్తులు, ల్యాయవాదులు, ల్సిబ్బంది, ప్రజలను బయటకు తరలించారు.బాంబ్ స్క్వాడ్ సిబ్బంది కోర్టు ప్రధాన భవనం,అనుబంధ భవనాలు,రికార్డు గదులు,వాహనాల పార్కింగ్ ప్రాంతాలు,కోర్టు ఆవరణ అంతటా సుదీర్ఘంగా గాలింపు చర్యలు చేపట్టారు.డాగ్ స్క్వాడ్ సహాయంతో ప్రతి మూలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.అయితే ఎలాంటి బాంబులు లేదా అనుమానాస్పద వస్తువులు లభించకపోవడంతో ఇది తప్పుడు బెదిరింపుగా అధికారులు నిర్ధారించారు.దీంతో కోర్టు ప్రాంగణంలో ఉన్నవారు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంది.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, బెదిరింపు మెయిల్ పంపిన వ్యక్తిని గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిపారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కోర్టు పరిసరాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు టూటౌన్ సీఐ సృజన్ రెడ్డి వెల్లడించారు.

# పన్నుల వసూళ్ళ లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవాలి

### మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్



**జమ్మికుంట, ఫిబ్రవరి18( ప్రజాజ్యోతి ) :**

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి పన్నులు, నల్ల పన్నుల వసూళ్లలో వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి కమిషనర్ మహమ్మద్ అయాజ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జమ్మికుంట మున్సిపాలిటీ పన్నుల వసూళ్లలో మొదటి స్థానం నిలిచిందని, అదే మాదిరిగా ఈ ఆర్థిక సంవత్సరం ఈ నెల 28వరకు పన్నుల వసూళ్లు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికీ జమ్మికుంట మున్సిపాలిటీ టాప్ 5 స్థానంలో ఉందని ఈ నెల 28వరకు కష్టపడితే పన్నులు వసూళ్ళు పూర్తి చేయవచ్చన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో మూడు కోట్ల ఇంటి పన్ను వసూళ్లు చేసినందుకు గాను సి.డి.ఏం.ఎ నుండి నిధులు మంజూరు అయ్యాయని, ఇప్పుడు అదే మాదిరిగా పన్నులు వసూళ్ళు చేసి మరికొన్ని నిధులు మంజూరు చేసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. గతంలో ప్రజలు, మున్సిపల్ సిబ్బంది, ప్రజా ప్రతినిధుల సహకారంతో పన్నుల వసూళ్లలో మొదటి స్థానంలో నిలిచామని, ఈ ఆర్థిక సంవత్సరం పూర్తి స్థాయిలో పన్నులు వసూలు చేయడంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం పన్నుల వసూళ్ళు 100శాతం పూర్తి చేసిన మొదటి వార్డు వార్డు ఆఫీసర్ జి. పోచం ను ఆయన అభినందించారు. పన్నుల వసూళ్లలో సహకరిస్తున్న ప్రజలకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఏ ఈ వికాస్, జె.ఏ.ఓ రాజశేఖర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీధర్, రాజ్ కుమార్, దీపిక, రెవెన్యూ అధికారి భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వాణి, శ్రీనివాస్ లతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# బాలుడితో బిక్షాటన చేయిస్తున్న తల్లిదండ్రులకు,కౌన్సెలింగ్

**వేములవాడ, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**




వేములవాడ ఎగ్జిబిషన్ వద్ద భిక్షాటన చేస్తున్న బాలుడిని జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట జిల్లా సంక్షేమ శాఖ అధికారులు హాజరు పరిచారు. వేములవాడ పట్టణంలోని ఎగ్జిబిషన్ వద్ద మంగళవారం రాత్రి ఓ బాలుడు గాంధీజీ వేషధారణలో భిక్షాటన చేస్తున్నట్లు చైల్డ్ హెల్ప్ లైన్ కు సమాచారం వచ్చింది. వెంటనే స్పందించిన జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం మిషన్ వాత్సల్య టీం, చైల్డ్ హెల్ప్ లైన్ టీం ని పంపించారు. వారు బాలుని రెస్క్యూ చేసి బాలల సంక్షేమ సమితి వారి ఆదేశాల ప్రకారము బాలుని పాఠశాలకు పంపించడానికి అతడి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి అప్పగించారు. మరోసారి భిక్షాటన కు పంపించినట్లయితే తల్లిదండ్రులపై జువైనల్ జస్టిస్ యాక్ట్ ప్రకారము కేసు నమోదు చేస్తామని జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజం హెచ్చరించారు.

# కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం



**వేములవాడ, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**

కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో అభివృద్ధి పూర్తిగా శూన్య మని చల్మెడ లక్ష్మీనరసింహారావు ధ్వజమెత్తారు. బుధవారం నిర్వహించిన ప్రెస్ మీట్లో ఆయన మాట్లాడుతూ.. రాజన్న సాక్షిగా భక్తులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కిందని, ఇది ముమ్మాటికీ వంచనేనని విమర్శించారు. పదే పదే ప్రజలను, భక్తులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. తమకు ఓట్లు వేసి దీవించిన వేములవాడ ప్రజలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.అసెంబ్లీలో ప్రభుత్వ విప్ హోదాలో ఉన్న వ్యక్తి, మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికల్లో విప్, ఉల్లంఘించడం ఏ మేరకు సమంజసమని వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్ఛార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు ప్రశ్నించారు. బుధవారం ఆయన వేములవాడలో మాట్లాడుతూ.. ఛైర్మన్ ఎన్నిక కోసం తగిన బలం లేనప్పటికీ కాంగ్రెస్ ఇద్దరు స్వతంత్రులను, ఒక బీఆర్ఎస్ కౌన్సిలర్ ను ప్రలోభాలకు గురిచేసి తమ వైపుకు లాక్కోవడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నూతన కౌన్సిలర్లు మరియు నిమ్మశెట్టి విజయ్, రాజు, గోస్కుల రవి,వెంగళ శ్రీకాంత్ గౌడ్, టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన ఫార్మాసిస్టుల ప్రతినిధులు



**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**

ఫార్మాసిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రతినిధుల బృందం తెలంగాణ ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఫార్మాసిస్టులు ఎదుర్కొంటున్న వివిధ పరిపాలనా, సేవా సంబంధిత సమస్యలను మంత్రికి వివరించారు. ఉద్యోగ భద్రత, పదోన్నతులు, సేవా నియమావళి అమలు వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు వెల్లడించారు. ఫార్మసీ కౌన్సిల్ సభ్యులు మాదురి వినోద్ కుమార్, రాజు, సుధాకర్, కేష్ పాల్గొన్నారు.

# వైద్యం డాక్టర్లది... వ్యాపారం ఆర్ఎంపీలది

**వైద్యుల కంటే... ఆర్ఎంపీలదే హవా**

**ఆర్ఎంపీల రిఫరెన్స్ తోనే ప్రైవేట్ దవాఖాన మనుగడ**

**మెడికల్ మాఫియాను శాసిస్తున్న గ్రామీణ వైద్యులు**

**కమిషన్ ఇస్తేనే రోగులను పంపిస్తా**



హుజురాబాద్, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):

భువిపై ఉన్న ప్రత్యక్ష దైవం వైద్యులు... మనుషుల ప్రాణాలను రక్షించే వైద్యులు నేడు కరెన్సీ కబంధహస్తాల్లో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నారు. మనుషులకు ప్రాణంపై ఉన్న ఆపేక్షే కొంతమంది వైద్యులకు వ్యాపారంగా మారింది. ప్రాణాపాయ పరిస్థితులో ఉన్న వారు ఎంత డబ్బైనా ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉంటారని వాస్తవాన్ని గ్రహించిన వైద్యులు కరెన్సీ వేట లో పడ్డారు. వైద్యుల వద్ద సహాయకులుగా పనిచేసిన కొంతమంది రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్ (ఆర్.ఎం.పి) లుగా మారి విద్య నేర్పిన గురువులకే సవాల్ గా మారారు. లక్షలు వెచ్చించి మెడిసిన్ చదివిన వైద్యులు కొద్దిపాటి చదువులతో నిలిపివేసిన వారి చేతిలో కీలుబొమ్మలుగా మారారు. సీజనల్ వ్యాధులు జ్వరాలు రావడం సహజం. జ్వరం, సీజనల్ వ్యాధులు వచ్చిన వెంటనే సంబంధిత డాక్టర్ దగ్గరికి వెళ్లి రోగనిర్ధారణ పరీక్షలు చేయించుకుని వాటికి సరైన మందులు వాడితే ఆరోగ్యం క్షీణించకుండా తొందరగా నయం అయ్యే అవకాశం ఉంటుంది. పనుల ఒత్తిడి వల్ల కానీ, ఆర్థిక ఇబ్బందుల వలన కానీ గ్రామాల్లో ఉండే ఆర్ఎంపి, పి.ఎం.పి ల సలహా మేరకు ఇంజక్షన్లు చేపించుకోవడం, అప్పటి వరకు మందులు వాడడం వంటివి చేస్తుంటాం, ఇలా చేయడం వల్ల వ్యాధి నయం కాకపోగా మరింతగా ఆరోగ్యం క్షీణించి ఎక్కువ ఇబ్బందులకు గురిచేస్తుంది. ఆర్.ఎం.పి, పిఎంపీలు వారి సొంత లాభం కోసం సులభంగా వచ్చే డబ్బు కోసం హాస్పిటల్స్ కి వెళ్లకుండా ఆపి ఒకటి రెండు రోజులు వారికి తోచిన వైద్యం చేస్తూ కాలం వెళ్లదీస్తారు. ఎటువంటి శిక్షణ లేని ఆర్ఎంపీలు వైద్యం చేసి మనల్ని ఇబ్బంది పెట్టడమే కాకుండా వారికి పరిచయం ఉన్న డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లి ముందుగానే డాక్టర్ తో వారి కమిషన్ పై ఒప్పందం కూల్చుకుంటారు. రోగిని తీసుకు వస్తున్నట్లుగా ముందుగానే సమాచారమిచ్చి కమిషన్ మాట్లాడుకుంటారు. డాక్టర్లను ఒత్తిడి చేసి మరి పరీక్షలు అధికంగా రాయిస్తుంటారు. రోగికి పరీక్షలు చేపించి, ఆ పరీక్షలకు చెల్లించిన డబ్బులలో 50 నుండి 70 శాతం వరకు కమిషన్ రూపంలో తీసుకుంటారు. రోగులు తమ ఆసుపత్రికి ఎక్కడ రాకుండా పోతారో అని అర్హత కలిగిన వైద్యులు ఆర్.ఎం.పి, పీఎంపీల బలవంతం మేరకు పరీక్షలు అధికంగా రాస్తున్నారు. ఒకవేళ ఆర్.ఎం.పి పి.ఎం.పిలు చెప్పినట్టు కమిషన్ ఇవ్వకపోతే వారి యూనియన్ లో సదరు డాక్టర్ గురించి, హాస్పటల్ గురించి తప్పుగా చెప్పి ఆ హాస్పటల్ కి రోగులు పోకుండా చెడు ప్రచారం చేస్తూ వారిని ఇబ్బంది పెడుతున్నారు. ప్రతి సంవత్సరం ఏదో ఒక కానుక రూపంలో కమిషన్ రూపంలో విందు రూపంలో ఆర్.ఎం.పి పి.ఎం.పి లకు సేవలు చేస్తూ వారి మెప్పు పొంది పేషెంట్లను తెప్పించుకోవడం క్వాలిఫైడ్ డాక్టర్ల వంతు అయిపోతుంది. ఆర్.ఎం.పి పి.ఎం.పిలకు కమిషన్ ఇవ్వడం వల్ల పేద ప్రజల పైన ఆర్థిక భారం పడుతుంది. క్వాలిఫైడ్ డాక్టర్లకు హాస్పటల్ మెయింటెనెన్స్ భారం పడుతుంది. ఇలా హాస్పిటల్స్ మెయింటెన్ చేయక పోవడం వలన మూతపడిన హాస్పిటల్స్ చాలానే ఉన్నాయి. మెడికల్ మాఫియా, డయాగ్నొస్టిక్ సెంటర్ల మాఫియా అని చాలా పేర్లు వింటూనే ఉంటాం అసలు ఈ అన్ని మాఫియా లకు మూలం ఆర్.ఎం.పి, పి.ఎం.పి వ్యవస్థ. ఆర్ఎంపి పి.ఎం.పి లు చెబితేనే ప్రజలు వింటూ వారు చెప్పిన హాస్పిటల్స్ కి మాత్రమే ప్రజలు వెళ్తున్నారు. డబ్బులు కట్టేది ప్రజలు అది చివరికి చేరేది ఆర్ఎంపీల చేతుల్లోకి. ఒకవేళ పంపించిన హాస్పిటల్లో ట్రీట్మెంట్ పూర్తిగా అందకపోతే వారిని ఇతర పెద్ద హాస్పిటల్స్ కి పంపిస్తే ఆ హాస్పిటల్స్ నుండి డయాగ్నొస్టిక్ సెంటర్ ల నుండి కూడా పెద్ద మొత్తంలో డబ్బు కమిషన్ రూపంలో వస్తుంది. డయాగ్నొస్టిక్ సెంటర్, ఎమ్మార్ఐ, సిటీ స్కాన్, బెడ్ చార్జీలు, ఆపరేషన్ చార్జిలు ఇలా ఏ రూపంలో రోగులు డబ్బులు చెల్లించిన తిరిగి కమిషన్ రూపంలో ఆర్ఎంపీల జేబులోకి వస్తుంది. నిజానికి ఆర్.ఎం.పి, పి.ఎం.పి ల కమిషన్ దందా లేకపోతే చాలా తక్కువ ఖర్చుకి సేవలు అందించడానికి చాలామంది క్వాలిఫైడ్ డాక్టర్స్ సిద్ధంగా ఉన్నారు. క్వాలిఫైడ్ డాక్టర్ ని తప్పు పట్టే సామాన్య జనం, చదువుకున్న నిరక్షరాస్యులు, సమాజంలో మంచి స్థాయిలో ఉన్నవారు కూడా ఎటువంటి క్వాలిఫికేషన్ లేని కనీసం ఇంగ్లీషులో వాళ్ల పేరు కూడా రాయరాని ఆర్.ఎం.పి, పి.ఎం.పి లను నమ్మి ప్రాణాలను పణంగా పెడుతున్నారు.

### వైద్యుల కంటే... ఆర్ఎంపీ లేదే హవా...



వైద్య చికిత్సలు చేసేందుకు సంవత్సరాలపాటు కష్టపడి విద్యనభ్యసించిన వైద్యులు నేడు గ్రామీణ వైద్యుల కనుసన్నల్లో పనిచేయాల్సిన దుస్థితి నెలకొని ఉంది. ఆసుపత్రికి వెళ్తే పరీక్షల పేరుతో, ఆస్పత్రికి వెళ్లేందుకు రవాణా చార్జీల భయం, మందులు కొనేందుకు సరిపడా డబ్బులు లేకపోవడం లాంటి విషయాలను గ్రహించిన కొంతమంది ఆర్ఎంపీలుగా అవతారం ఎత్తి నేడు ప్రైవేట్ ఆస్పత్రుల భవిష్యత్తును నిర్ణయిస్తున్నారు.

### కమిషన్ ఇస్తేనే రోగులను పంపిస్తాం



మీ ఆసుపత్రికి రోగులను పంపాలంటే మాకు కమిషన్ ఇవ్వాల్సిందే. లేదంటే మీ ఆస్పత్రి మనుగడ అసాధ్యం అని ఆర్ఎంపి లు శాసిస్తున్నారు. ఒక రోగిని ఆసుపత్రికి పంపితే వైద్యుని కలిసేందుకు తీసుకుని ఫీజు నుండి, ల్యాబ్, మందుల బిల్లుల లోను తమకు వాటా ఇస్తేనే మీ వద్దకు రోగులను పంపిస్తామని అల్టిమేటం జారీ చేస్తున్నారు. దీంతో సంవత్సరాల తరబడి కష్టపడి, లక్షల రూపాయలు వెచ్చించి వైద్య విద్యను అభ్యసించిన వైద్యులకు సంపాదన లేకపోవడంతో తప్పని పరిస్థితులో ఆర్ఎంపీలను ఆశ్రయించక తప్పడం లేదు.

### రెఫర్ మనీ పర్సంటేజ్ (ఆర్.ఎం.పి)

గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజల ప్రథమ చికిత్స కోసం పనిచేయాల్సిన రూరల్ మెడికల్ ప్రాక్టీసనర్స్ నేడు రెఫర్ మనీ పర్సంటేజ్ (ఆర్.ఎం.పి) గా మారిపోయారు. కేవలం ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వైద్యులను సంప్రదించాల్సిన ఆర్ఎంపీలు నేడు వైద్యులను శాసించే స్థాయికి చేరారు. ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యుల వద్దకు రోగులను పంపాలంటే కచ్చితంగా వారికి కమిషన్ ఇవ్వాల్సిందే. లేదంటే ఆ ఆస్పత్రి మనుగడ ప్రశ్నార్థకమే. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరక్షరాసులైన నిరుపేద ప్రజలకు వైద్య పరీక్షలు, మందుల వివరాలు, ఏ వైద్యులు ఏ చికిత్సలు చేస్తారో తెలియకపోవడంతో ఆర్ఎంపీలను సంప్రదిస్తున్నారు.

---

## స్వంత ఖర్చులతో రెండు గ్రామాల్లో బస్ షెల్టర్ నిర్మిస్తా స్థలం చూపండి

**బస్ షెల్టర్ లేక ప్రయాణికుల ఇబ్బందులు**

**ముందుకు వచ్చిన ముదిమాణిక్యం యువకుడు జెరిపోతుల రాజు**



చిగురుమామిడి, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):

మండలంలోని ముదిమాణిక్యం,రామంచ గ్రామాల్లో ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రెండు గ్రామాల్లో తన సొంత ఖర్చులతో బస్ షెల్టర్ నిర్మిస్తానని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన జెరిపోతుల రాజు అనే యువకుడు ముందుకు వచ్చి ఆదర్శంగా నిలుస్తున్నారు.రెండు గ్రామాల్లో బస్ షెల్టర్ నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని కేటాయిస్తే యుద్ధ ప్రాతిపదికన బస్టాండ్ నిర్మాణాలు చేస్తానని రాజు ఆయా గ్రామ సర్పంచ్ లకు,గ్రామపంచాయతీ కార్యదర్శులకు బుధవారం వినతి పత్రాలను అందజేసినట్లు చెప్పారు.ఈ రెండు గ్రామాల్లో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండకు,వర్షాలకు చాలా ఇబ్బంది పడుతున్నారని రాజు ఆవేదన వ్యక్తం చేశారు.రెండు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రహించి ఆసక్తితో,సొంత ఖర్చులతో నిర్మించడానికి స్థలం చూపించి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని రాజు ఆయా గ్రామాల సర్పంచ్ లను కోరారు.

---

## ఉచిత వంటగ్యాస్ సిలిండర్ల పంపిణీ

ముస్తాబాద్, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):

ముస్తాబాద్ మండలంలోని ఆనూర్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు సౌల క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద లబ్ధిదారులకు వంటగ్యాస్ సిలిండర్లు మరియు స్టవ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సౌల క్రాంతి కుమార్ మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా వంటగ్యాస్ సిలిండర్లు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేద కుటుంబాల మహిళలకు పొగరహిత వంట సౌకర్యం కల్పించడం ఈ పథక ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులందరికీ ఈ పథకం ప్రయోజనం చేకూరేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్క దాసరి రవి, ఉపసర్పంచ్ రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమం సాదరంగా మరియు ఉత్సాహభరితంగా జరిగింది.



---

## పరీక్ష ప్యాడులు బహుకరణ



ధర్మారం, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో నర్సింహులపల్లి, రచ్చపల్లి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు న్యాయవాది ఆకారి రాజేశం పరీక్ష ప్యాడులు,పెన్నులు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానంతో మాత్రమే కాకుండా మంచి క్రమశిక్షణ, విద్యాబుద్ధులు అలవరచుకోవాలని సూచించారు.జీవితంలో విజయాన్ని సాధించాలంటే కష్టపడి చదవడం, సమయపాలన పాటించడం, గురువుల సూచనలు అనుసరించడం ఎంతో అవసరమని తెలిపారు. ప్రస్తుతం జరుగబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో రాయాలని విద్యార్థులకు కోరారు.పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా సిద్ధం కావాల న్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సంకల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, సమ్మయ్య, ఉపాధ్యాయులు భాస్కర్, బాలు నాయక్, శేఖర్, ఆంజనేయులు,లక్ష్మి, కవిత పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు

## ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించిన వెల్గటూర్ ఎస్సై ఉదయ్ కుమార్,



**ఎండపల్లి, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**
బాల్య వివాహాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలని సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ , జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన ప్రచార రథాన్ని వెల్గటూర్ ఎస్ ఐ ఉదయ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు, ఉమ్మడి వెల్గటూర్ మండలంలో అన్ని గ్రామాలలో అలాగే పాఠశాలలో అవగాహనా కార్యక్రమం నిర్వహిం చారు, బాల్యం అమూల్యమైన దశ అని, బాల్య వివాహాలు పిల్లల చదువు, ఆరోగ్యం, శారీరక,మానసిక అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. చదువు మధ్యలో ఆగిపోవడం వల్ల జీవితాంతం ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని, బాలికల విద్యను ప్రోత్సహిస్తూ ఉచిత విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.పిల్లలు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ ప్రచార రథం అన్ని మండలాల్లో తిరిగి అవగాహన కార్యక్రమాలు చేయడం జరుగుతుంది అని వారు తెలిపారు,ఈ కార్యక్రమంలో సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ పోలవేణి భూమేష్, కమ్యూనిటీ మొబిలైజర్లు లత,శ్యామల, లహరి గ్రామ పంచాయతీ కార్యదర్శి లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.




# ఎంపీజే నూతన కమిటీ ఏర్పాటు



**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**
పెద్దపల్లిలో మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) సంస్థ నూతన కమిటీని స్థానిక ఎంబీ గార్డెన్‌లో స్థాపక సభ్యులు, మద్దతుదారుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని ఎంపీజే పరిశీలకులు మొహమ్మద్ వసీముద్దీన్ వెల్లడించారు. యూనిట్ అధ్యక్షుడిగా మొహమ్మద్ మిస్బాహ్ ఉద్దీన్ (న్యాయవాది), ఉపాధ్యక్షుడిగా మొహమ్మద్ ఇస్తేకామ్ ఉద్దీన్, ప్రధాన కార్యదర్శిగా మొహమ్మద్ అబ్దుల్ వాజిద్, ఖజాంచిగా మొహమ్మద్ మొహ్సిన్ షరీఫ్‌లను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వసీముద్దీన్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలను సభ్యులకు వివరించారు. ఈ ఉద్యమం ఎటు వంటి వివక్ష లేకుండా ప్రతి పౌరుని హక్కులను రక్షించడమే లక్ష్యంగా పని చేస్తుందని పేర్కొన్నారు. న్యాయం, సమానత్వం, శాంతి యుత ఉద్యమం, సమగ్ర సామాజిక అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఎంపీజే ముందం జలో నిలవాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ సభ్యులు సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా కట్టుబా టుతో పని చేయాలని సూచించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ మతీన్ ఉద్దీన్ నూత నంగా ఎన్నికైన బృందాన్ని అభినం దించారు. పెద్దపల్లిలో సమాజంలోని అన్ని వర్గాల సంక్షే మం కోసం అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుండి సంస్థను బలోపేతం చేసి, ప్రతి కార్యక్రమంలో శాంతి, న్యాయం విలువలను పాటించాలని సభ్యులకు సూచిం చారు. సమావేశం ముగింపు లో నూతన యూనిట్ పెద్దపల్లిలో సామాజిక సామరస్యం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, సమాజ సాధికారత కోసం చురుకుగా పనిచేయాలని ప్రతిజ్ఞ చేసింది.

# కుమ్మరి కుంటలోకి నీటి విడుదల

**కోనరావుపేట, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**
మల్కపేట రిజర్వాయర్ ద్వారా వచ్చే నీటిని అధికారులు కొనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో ప్రత్యేక పూజలు చేసి కుమ్మరి కుంటలోకి నీటిని విడుదల చేసినట్లు సర్పంచ్ జిన్నా అనూష అనిల్ కుమార్ తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందు జాగ్రత్తగా పట్టా భూమిలో ఉన్న రైతులతో సమావేశమై జెసిబి తో 150 మీటర్ల చదును చేసి పైప్లైన్ వేశామని సూచించారు ఈ చర్యతో గ్రామంలోని కుంటలు నిండుతూ భూగర్భ జలమట్టం పెరిగి రైతులకు గ్రామస్తులకు మేలు చేకూరుతుందని అన్నారు ప్రత్యేకంగా వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని చేపట్టిన ఈ నీటి విడుదల వల్ల సాగుకు సహాయపడుతుందని గ్రామ ప్రజలు ఈ నిర్ణయాన్ని హర్షిస్తూ అధికారులకు గ్రామపంచాయతీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాసం పెల్లి శ్రీనివాస్, వార్డు సభ్యులు మోకన పెల్లి బాలరాజ్, జాగిరి కిరణ్ గౌడ్ చిద్రవేణి నరేష్, జాగిరి ఆనందం ,జిన్నా సమత అర్జున్ ,రేగుల పద్మ పరశురాములు,జాగిరి లక్ష్మి శంకర్ రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు



# నిరాశ్రయులైన కరీంనగర్ వాసులకు చేయూత



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**
దైవ దర్శనానికి వెళ్లి..నగదు, లగేజీ సామగ్రి కోల్పోయిన ఓ బాధిత కుటుంబానికి కరీంనగర్ ఎంపీ కార్యాలయం బాసటగా నిలిచింది. నిరాశ్రయులైన వారి సమాచారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి వెళ్ళడం తో ఆయన వెంటనే తన కార్యాలయ సిబ్బందిని అప్రమత్తం చేసి వారిని కరీంనగర్ కు రప్పించే ఏర్పాట్లు చేశారు. కరీంనగర్ లోని రాంనగర్ కు చెందిన ఓ కుటుంబ సభ్యులు తమిళనాడు లోని కాంచీపురం వెళ్లారు. దైవ దర్శనం అనంతరం మంగళవారం రాత్రి ఆలయం చెంతన నిద్రించగా వారి సామగ్రిని గుర్తు తెలియని దొంగలు దొంగిలించారు. దీంతో బోరుమన్న ఆ కుటుంబీకులు స్థానికులకు ఈ విషయాన్ని చెప్పారు. బాధిత కుటుంబ సభ్యుల్లో ఒక బదిరుడు అండగా మరో ముగ్గురు మహిళలు.. ముగ్గురు చెన్నారులున్నారు. కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయానికి అక్కడి ఆలయ సిబ్బంది సమాచారం ఇవ్వడంతోకేంద్ర మంత్రి సూచనతో వారిని క్షేమంగా కరీంనగర్ రప్పించే ఏర్పాట్లు కార్యాలయ సిబ్బంది చేశారు. వారికి అక్కడ భోజన వసతి కల్పించడం తో పాటు కరీంనగర్ వచ్చేందుకు వీలుగా రైలు టికెట్స్ బుక్ చేయించారు. ప్రయాణ ఖర్చులను అందించారు. తక్షణమే మంత్రి స్పందించి న తీరుపై బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

# మున్సిపల్ నూతన చైర్మన్ కి కార్మిక సంఘం నాయకులు సన్మానం



**మెట్ పల్లి, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**
నూతనంగా ఎన్నికైన మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి కి మరియు మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ కి మున్సిపల్ కార్మిక సంఘం సభ్యులు మరియు అధ్యక్షుడు బర్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించి పూల బొకే ఇవ్వడం జరిగింది. మరియు మూడవ వార్డు కౌన్సిలర్ బత్తుల నరేష్ కి 13వ వార్డు కౌన్సిలర్ గుడి కందుల అజయ్ కి సన్మానించడం జరిగింది., అనంతరం వారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన చైర్మన్ మా కార్మికుల సమస్యలు ఏదైనా ఉంటే పరిష్కరించాలన్నారు పట్టణ అభివృద్ధికి మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు నూతనంగా ఎన్నికైన పాలకవర్గానికి కార్మికుల పక్షాన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లంక శ్రీకాంత్ మధురమ్మ, అనిల్, ఏఐటీయూసీ కార్యదర్శి ఎండి ఉస్మాన్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన తహసిల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన ఆర్డిఓ బి .గంగయ్య



**కాల్వ శ్రీరాంపూర్ , ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**
కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో .నూతనంగా నిర్మించిన. తహసిల్దార్ కార్యాలయాన్ని. పెద్దపల్లి ఆర్డీవో. బి గంగయ్య. బుధవారం రోజున పరిశీలించారు. ఈయన వెంట. తహసిల్దార్ పుల్లూరు. జగదీశ్వర రావు. డిప్యూటీ తహసీల్దార్ శంకర్ గౌడ్. రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# వాలీబాల్ పోటీలనూ వీక్షించిన కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు



**వేములవాడ, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):**
వేములవాడ: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు వేములవాడ గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్నారు ఈ వాలీబాల్ పోటీలను కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు వీక్షించారు అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నీ కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు, రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న జాతీయ క్రీడాకారులు అభి శ్రీ, హరిణి, సైనా, కీర్తి క్రీడాకారులనుండి క్రీడా అంశాలుఅడిగితెలుసుకున్నారు వారిసలహాలు సూచనలు తీసుకున్నారూ. రాష్ట్రస్థాయివాలీబాల్ పోటీలుచూడడం మాకెంతో సంతోషంకరంగా ఉంది అని ఈ సందర్భంగా కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు తెలియజేశారు.



## నర్సరీలను పరిశీలించిన ఎంపీడీవో



కాల్వ శ్రీరాంపూర్, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ఇధిలాపూర్. పెద్ద రాతుపల్లి. చిన్న రాతుపల్లి .మోట్లపల్లి. తదితర. గ్రామాల్లో గల. నర్సరీలను. ఎంపీడీవో. కలికోట రామ్మోహన చారి. బుధవారం రోజున పరిశీలించారు. వేసవిలో చెట్లను కాపాడేందుకు తగు జాగ్రత్తలు. తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎ.పీ ఓ మంజుల. గ్రామ సెక్రటరీలుమహేందర్ రెడ్డి. రాజేంద్రప్రసాద్ .సమ్మయ్య. బెజ్జాల సంపత్. రాజు.లక్ష్మణ్. రమేష్. ఉన్నారు.

## నూతన కౌన్సిలర్లకు ఘన సన్మానం



కోరుట్ల, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):

కోరుట్ల పట్టణంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కౌన్సిలర్లకు ఘన సన్మానం పట్టణంలోని ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే బిల్డర్స్ అధినేత అర్షద్ ఖాన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది.ఈ సందర్భంగా ఇటీవల ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందిన కౌన్సిలర్లను శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. పట్టణ అభివృద్ధికి కౌన్సిలర్లు సమిష్టిగా కృషి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అర్షద్ ఖాన్ ఆకాంక్షించారు.నూతన కౌన్సిలర్లు మాట్లాడుతూ, తమపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, కోరుట్ల అభివృద్ధే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. మౌలిక వసతుల అభివృద్ధి, శుద్ధజల సరఫరా, రహదారుల నిర్మాణం, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, యువ నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని నూతన కౌన్సిలర్లకు అభినందనలు తెలియజేశారు.

## సీఎం కప్ పోటీలకు ఎంపిక

### హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొననున్న మణికంఠ పాఠశాల విద్యార్థి

ధర్మారం, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):

సీఎం కప్ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు సాయి మణికంఠ స్కూల్ విద్యార్థి ఎంపికయ్యాడు.ధర్మారం మండల కేంద్రంలోని సాయి మణికంఠ మోడ్రన్ హై స్కూల్ కి చెందిన 9వ తరగతి విద్యార్థి కె.అరుణ్ ఈనెల 14వ తేదీన జగిత్యాల జిల్లాలో నిర్వహించిన జిల్లాస్థాయి సీఎం కప్ హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొని తన ప్రతిభ కనబరిచాడు. ఈనెల 20 నుండి 23వ తేదీ వరకు హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీఎం కప్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ జైన సురేష్ కుమార్,మేనేజింగ్ డైరెక్టర్ జైన రమాదేవి తెలియజేశారు.పిఈటి సాయికుమార్,ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.



# పార్టీలకు అతీతంగా అభివృద్ధి యే లక్ష్యం

**ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతా**

**నాయిని చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దడం**

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని మినీ స్టేడియంగా మార్పు**

**మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్...**



జమ్మికుంట, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి) :

జమ్మికుంట పట్టణ అభివృద్ధి నా ప్రథమ లక్ష్యమని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తానని నేను అందరి వాడిని అని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అన్నారు. మున్సిపల్ చైర్మన్ గా గెలిచిన తర్వాత బుధవారం పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో తన సహోదరి ప్రణీత తో కలిసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా జమ్మికుంట పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు. కాంగ్రెస్ టిఆర్ఎస్ బిజెపి అగ్ర నాయకులతో కలిసి పట్టణానికి నిధులు తీసుకొస్తానని అన్నారు.

**జమ్మికుంట అభివృద్ధి ప్రణాళికలు :**

జమ్మికుంట పట్టణ సమగ్ర అభివృద్ధికి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ పలు కీలక ప్రణాళికలను ప్రకటించారు. పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య, వినోద, క్రీడా సదుపాయాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి ఆధునిక వైద్య సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వైద్య సిబ్బంది పెంపు, అవసరమైన పరికరాల ఏర్పాటు, మౌలిక వసతుల విస్తరణపై దృష్టి సారిస్తామని తెలిపారు. అలాగే నాయిని చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్ది పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. చెరువు చుట్టూ నడక మార్గాలు, లైటింగ్, హరిత వనాలు ఏర్పాటు చేసి కుటుంబాలతో సమయం గడిపే స్థలంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. యువతలో క్రీడా ప్రోత్సాహం కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని మినీ స్టేడియంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. క్రీడా సదుపాయాలు, ట్రాక్, గ్యాలరీలు ఏర్పాటు చేసి స్థానిక క్రీడాకారులకు మెరుగైన వేదిక కల్పిస్తామని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి కోసం ప్రకటించిన ఈ ప్రణాళికలను దశలవారీగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.

**ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తా**

తాను గెలిస్తే చేస్తానన్న ప్రతి హామీని నెరవేరుస్తానని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. తనపై తన చెల్లెలిపై నమ్మకంతో భారీ మెజార్టీతో గెలిపించిన 23వ వార్డు, 24వ వార్డు తోపాటు పట్టణంలోని మిగతా వార్డు ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని ఏ వార్డులో సమస్య ఉన్న నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ప్రశాంత్ ప్రజలకు తెలిపారు. నేను మీ బిడ్డగా మీకు సేవలు అందిస్తానని పట్టణంలో ఎక్కడ ఏ సమస్య ఉన్న నేరుగా తన దృష్టికి తీసుకువస్తే అధికారుల సహకారంతో సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. అభివృద్ధి విషయంలో అధికార పార్టీ తోపాటు బిజెపి సహకారం కూడా తీసుకుంటానని ఇందులో ఎవరికి ఎలాంటి సందేహం అవసరం లేదని మున్సిపల్ చైర్మన్ గా నా బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు.

**మున్సిపల్ చైర్మన్ ని అభినందించిన కాకతీయ విద్యాసంస్థల అధినేత :**

నూతనంగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన మొలుగు ప్రశాంత్ కుమార్, కౌన్సిలర్‌గా గెలుపొందిన ప్రణీత లను కాకతీయ విద్యాసంస్థల అధినేత, చైర్మన్ అవిర్నేని సుధాకర్ రావు అభినందించారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అవిర్నేని సుధాకర్ రావు మాట్లాడుతూ... ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్నా నాయకునిగా ప్రజాసేవలో అంకిత భావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి జమ్మికుంట పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని ఆశీర్వదించారు. పట్టణ సమస్యల పరిష్కారంలో సమర్థవంతమైన పాలన అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో విద్యాసంస్థల ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.



## ప్రారంభించనిద ఇందిరమ్మ ఇండ్లను రద్దు చేయాలి

### రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండీ విపి గౌతమ్



కొడిమ్యాల, ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి):

ఇంకా ప్రారంభం కాని ఇందిరమ్మ ఇండ్లను రద్దు చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండీ విపి గౌతమ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్మాణ దశలో ఉన్న, పూర్తి అయిన ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. ఇల్లు లేకుండా సొంత స్థలం ఉన్న ప్రతి కుటుంబం ప్రభుత్వ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గ్రామంలో ఒక్క గుడిసె కూడా ఉండకూడదని,ప్రభుత్వ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. స్లాబ్ పనులు పూర్తైన ఇళ్లను ఉగాది వరకు పూర్తి చేసి లబ్ధిదారులకు గృహప్రవేశం కల్పించాలని సూచించారు. ఇంకా పనులు ప్రారంభించని యూనిట్లను రద్దు చేయించే దిశగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇండ్ల నిర్మాణాలు జాప్యం లేకుండా వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ఈశ్వరయ్య, హౌసింగ్ పీడీ ప్రసాద్, డీఈ భాస్కర్, ఎంపీడీవో స్వరూప, ఎమ్మార్వో కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## సీఎం కప్ రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్ పోటీలకు ఎంపికైన విద్యార్థి

ముస్తాబాద్, ఫిబ్రవరి 18 ( ప్రజా జ్యోతి ):

ముస్తాబాద్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోతుగల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి డి. రామ్ చరణ్, రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయిలో నిర్వహించిన ముఖ్యమంత్రి కప్ క్రీడా పోటీలలో లాంగ్ జంప్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తడకల శ్యాంసుందర్ మాట్లాడుతూ, రామ్ చరణ్ ప్రతిభ, క్రమశిక్షణ, కృషి ఫలితంగానే ఈ విజయాన్ని సాధించాడని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురభి రాధాకిషన్ రావు, గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్, ఉపసర్పంచ్ కోలా కృష్ణ, వార్డు సభ్యులు, ఉపాధ్యాయ బృందం మరియు గ్రామస్థులు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా రామ్ చరణ్ విజయం సాధించి పాఠశాలకు, గ్రామానికి మరింత గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు.

